# మమ్మీ డాడీ! నన్ను అర్థం చేసుకోండి

-సబ్బని లక్ష్మీనారాయణ

మమ్మీ డాడీ నేను బడికి పోను. నాకు బడికి పోవాలనిపించడం లేదు. బడిలో చదవడంలేదని, రాయడం లేదని కొడతారు. నేను చక్కగా చదువు కోవాలని, బాగా చదువుకోవాలని ఎంత కోరిక మీకు. చదువుకున్న తల్లిదండ్రులు కదా మీరు. అన్నయ్య కూడా పట్నంలో కంప్యూటర్ కోర్సు చదువు కుంటున్నాడు కదా. బడి అంటే మీరు ఎంత గొప్పగా చెపుతారు, బడి చదువులు గుడిలాంటిదని, చిన్నారుల ఆటస్థలం లాంటిదని, వలస వచ్చిన విడిది ఇల్లులాంటి దని, చిన్నారుల బతుకు నిచ్చెన లాంటిదని. బడిలో పచ్చని చెట్లు, పిచ్చుక గూళ్లు, సుందర దృశ్యాలు ఉండాలని ఎంతగా అభిలషిస్తారు. బడి అంటే చెవిమెలికలు కర్ర దెబ్బలు కావని ఎంత బాగా చెప్తారు. బడిపంతులంటే బతుకలేక బడిపంతులు కాదు. బతుక నేర్పేవాడు, బతుకనేర్చినవాడు అని చెపుతారు కదా. కాని బడంటే కేవలం నాలుగ్గోడల మధ్య నేనా, కేవలం చదవడం, రాయడం మాత్రమేనా. చదువూ.. చదువూ, రాయీ, రాయీ... ఇంతే కదా చిన్ననాటి నుండి. హోంవర్క్ రాయాలి, పుస్తకాలు చూసి రాయాలి, గైడ్లు చూసి రాయాలి. రాయటం తప్ప ఇంకేమీ లేదు. ఎంత అదృష్టవంతులు మీరు! చిన్ననాడు ఎంత ఆహ్లాదంగా ఆనందంగా చదువుకున్నారు. అప్పుడు ఇన్ని గంటల చదువు లేదు కదా, ఊకే చదవడం, రాయడం లేదు కదా. అప్పుడు ఈ చదువులు, ఈ గైడ్లు చూసి రాసుడు చదువుడు లేదు కదా. ఇంత బాగా చదవాలా? పొద్దున ఏడింటి నుంచి రాత్రి ఏడింటి వరకు బడికి పోయి రావాలి కదా. ఎంత బాధ. రాత్రి ఏమయినా టైం దొరికితే మిగిలిన హోంవర్క్ చెయ్యాలి, చదువుకోవాలి. పదవ తరగతి, పన్నెండవ తరగతి వస్తుంటే ఉదయం అయిదు గంటలకే వెళ్లాలి, వేసవి సెలవుల్లో కూడా వెళ్లాలి బడికి. ఇక సెలవులెక్కడివి? ఎంత మథనపడాలి చదువుల గురించి, పిల్లలు పిల్లల కోసం చదువు కోవాలా, తలిదండ్రుల కోసం చదువుకోవాలా, ఎంత పోటీ ప్రపంచం ఇది. గురువులు చెప్పినట్లు చదువు కోవాలి, తలిదండ్రులు చెప్పినట్లు చదువుకోవాలి. పోటీపడి చదువుకోవాలి మంచి మార్కులు తెచ్చుకోవాలి. మంచి మార్కులు తెచ్చుకోకపోతే బడిలో చిన్నచూపే. మీకు మాత్రం మంచి బడి కావాలి. మంచి బడి అంటే ఎక్కువసేపు చదువు చెప్పడం, ఎక్కువ హోంవర్క్‌లు ఇచ్చేబడి. ఎంతటి ఆజమాయిషీ కింద చదువుకోవాలి నిరంతరం! ఇన్ని సంవత్సరాలు ఎలానో నెట్టుకొచ్చాను. ఇప్పుడు పదవ తరగతి కదా, ఇప్పుడు ఇంకా బాగా చదవాలి. వారం వారం పరీక్షలు, స్లిప్ టెస్టులు. అందులో వెనుకబడిపోవద్దు. చదవాలి, రాయాలి, మంచి మార్కులు తెచ్చుకోవాలి. కొందరేమో చదువు రాకున్నా, నకలు కొట్టి మంచి మార్కులు తెచ్చుకుంటారు. నాకేమో నకలు కొట్టాలనిపించదు. నాకొచ్చింది నాకు చాలు, అని రాస్తే తక్కువ మార్కులచ్చాయని తెల్లవారి అందరి ముందట గద్దింపు, అవమానం. అందుకే నాకు ఇక బడికి పోవాలని పించడంలేదు. గత నెల నుండి నేను బడికి పోవడం లేదు. జ్వరం వచ్చింది కూడా. చక్కగా చదవలేదు, చాలా రోజులయ్యింది బడికిపోక. చదువుల్లో రాతల్లో వెనుకబడిపోయాను. ఇక పోవాలనిపించడం లేదు బడికి పొమ్మని మీరు ఒత్తిడి చేస్తే నేనేమి చేయాలి, నేను ఇంట్లోంచి వెళ్ళిపోతానన్నాను ఎటైనా. ఇంకా ఒత్తిడి చేస్తే చనిపోతాలే అన్నాను, చదవకుంటే ఏమయిద్ది అన్నాను. మీరు గాబరా పడ్డారు. నాపై ఒత్తిడి వెయ్యడం మానుకున్నారు. చాలా రోజు లయ్యింది బడికిపోక, చదువుల్లో రాతల్లో వెనుకబడి పోయాను. ఇక పోవాలనిపించడం లేదు బడికి. మీరు గాభరా పడ్డారు. నేనిలా ఎందుకు మాట్లాడుతున్నానో అని, బడికి వెళ్లడంలేదని నాకు ఏదైనా గాలి సోకిందని నన్ను అమ్మమ్మ తాతయ్య వాళ్ల ఊరికి తీసుకెళ్లి తాయెత్తులు కట్టించారు, భూతవైద్యుడితో దిష్టి

## ప్రేమ గానం

నా భావాన్ని శృతిచేసి / నీ రాగాన్ని జతచేసి
పిల్లనగ్రోవి నేనౌతా!
నీ పిలుపుకు నేను / పులకించి ప్రేమగానం
వినిపిస్తా! -చిల్లర మహేశ్వరరావు

తీయించారు. నాలో ఏం మార్పు వచ్చిందని, నాకు బడి వాతావరణం నచ్చలేదు. అక్కడ నిరంతరం చదవడం, రాయడం నచ్చలేదు. పొద్దున ప్రైవేటు క్లాసులని, సాయంత్రం రాత్రిపూట చదువులని వెళ్ళడం నచ్చలేదు. మీతో సెలవుల తరువాత వెళ్తానని చెప్పాను, కాని వెళ్లలేదు. అలా కొన్నిరోజులు చూసి నాది ఓ మానసికమైన జబ్బు అని మీకు తెలిసిన వాళ్లతో సంప్రదించి నన్ను ఊరిలోని ఒక మానసిక వైద్యుని దగ్గరకు తీసుకెళ్లారు. అతడు నా గురించి విని ఇది మానసిక తత్త్వంకు సంబంధించిన జబ్బు అని నాకు పరీక్షలు చేయించాలని చెప్పాడు.

నన్ను తీసుకుని మీరు పట్నం వెళ్లారు. అక్కడ నాకు ఇష్టమైన, కష్టమైన విషయాల గురించి డాక్టరమ్మ అడిగింది. నాకు కొన్ని బొమ్మలు చూపించింది. నన్ను కూడా కొన్ని బొమ్మలు చూస్తూ గియ్యమంది. మిమ్మల్ని కూడా కొన్ని విషయాలు నా గురించి అడిగి, తెలుసుకొని ఓ రిపోర్టు రాసిచ్చింది. అయిదు వందల రూపాయల ఫీజు తీసుకుంది. నేను కొంత మానసిక ఆందోళనలో ఉన్నట్లు రిపోర్టు ఇచ్చి డాక్టర్ల దగ్గర కొన్ని రోజులు మందులు వాడమని చెప్పింది. మన ఊరి మానసిక వైద్యుడు ఆ రిపోర్టు చూసి నాకు మందులు రాసిచ్చాడు. కొన్ని రోజులు వాడాను కూడా.

ఆ మధ్యలోనే మీరు సరస్వతి నిలయం బాసర వెళ్దామన్నారు. సరస్వతి దేవాలయంకు వెళ్లివస్తే నేను చక్కగా చదువుకుంటానని మీ ఆశ. కాని నేను రానన్నాను. నాకు గుడికని రావడం ఇష్టం లేదన్నాను. అమ్మమ్మను తాతయ్యను ఇంటివద్ద నాకు తోడుగా ఉంచి మీరు బాసర వెళ్లివచ్చారు. నా కోసం పూజలు చేయించి, నోట్‌బుక్, కలం తీసుకొచ్చారు. రోజూ కొంత తింటే జ్ఞాపకశక్తి పెరుగుతుందని సరస్వతి ఆకును ఆ ఊరి దుకాణంలో కొనుక్కొచ్చారు. నా కోసం ఎంత తాపత్రయం మీకు. మందులు వాడడం శారీరకంగా మంచిది కాదని తలచి, వైద్యుడు ఇచ్చిన మందులు కొద్ది రోజులు ఆపి, నాది మానసిక సమస్య అని తలచి నాకు మంచి కౌన్సెలింగ్ అవసరమని నన్ను ఊరిలోనే ఒక హిప్నటిస్టు దగ్గరకు తీసుకెళ్లారు. అతను వేసిన ప్రశ్నలకు నేను సమాధానాలు ఫ్రీగా చెప్పలేదని నన్ను ఇంతకు ముందటి మానసిక వైద్యుని దగ్గర్నే ఇంకా కొద్దిరోజులు మందులు వాడి రమ్మన్నాడు కదా అతను. నేను ఉట్టి యంత్రాన్నా మీరు చెప్పినట్లు ఎనడానికి. ఎవరి మాటలు విందాం. అన్ని డబ్బులు

## మట్టికి మరణం వద్దు

పచ్చదనం కోసం మట్టిని ప్రేమిస్తూనే
మరణ మృదంగం వాయిస్తున్న రైతన్న
మనవైపు జాలిగా చూస్తున్నాడూ
దాచుకున్న ఉరితాడును తీస్తున్నాడు.
కపటం లేకుండానే / చెమట పోసి పండిస్తున్నా-
కారుణ్యం లేని మనల్ని
మట్టివాసనతో మాట్లాడమంటున్నాడు.
పురుగు తినకుండా చూసీ / పిట్టరాకుండా చేసీ
మొట్టమొదటి నుండి కాపాడుతునే వున్నా,
సునామీ రాకుండానే... / తుపాన్ లేకుండానే
కంచె మేసే చేను గురించి
కాసేపాలోచించమంటున్నాడు.
కల్తీ విత్తనాల్తో / కరెంటు బాధల్తో
నిద్రాహారాలు మాని పంజేస్తున్నా
దరిద్రం వెంబడే వుంటోందీ
నిన్నాదిలే ప్రసక్తే లేదంటోంది.
రైతన్నల్ని వెన్నెముకలన్నారుగానీ
పక్కటెముకల్లేని బక్కజీవులు వాళ్లు.
కష్టపడి పండించుకున్నా / గిట్టుబాటు కానివ్వరు.
అమ్ముకుందామని ఆశపడినా
దగుల్బాజీ దళారీల పోరు.
తెచ్చిన అప్పు తెల్లారేసరికి / పెరిగిపోతుంటే...
వచ్చిన సొమ్ము వడ్డీకే సరిపోదు.
భూమినమ్ముకుంటే బావుండుగానీ
భూమిన్నమ్ముకున్నామనేదే బాధ.
మట్టిలో కలిసే వరకు / మట్టితోనే వుండాలి గానీ
ఉరితాడుతో ఊపిరెందుకు పోవాలి!
అందుకే...
బువ్వపెట్టే భూమిని ప్రేమిస్తునే వుంటాను.
దళారీలు పోయేవరకూ / ఉద్యమిస్తూనే వుంటాను.
పండించనని పంతం పడితే
డొక్కలెండి జనం ఛస్తారని/మీవైపే చూస్తున్నానూ
జాలిగా అర్థిస్తున్నాను.
మాకు లేకున్నా తిండి మీకు పెడుతున్నందుకూ
మమకారంతో మావైపు చూడండీ,
బ్రతకడానికి తిండి గురించి ఆలోచించండి.
మట్టికి మరణం వద్దంటూ / గట్టిగా నొక్కి చెప్పండి.
మనందరం కలిసుందామంటూ
మనస్ఫూర్తిగా మాట్లాడండి.

-కన్నోజు లక్ష్మీకాంతం

## కవిత్వం

కవిత్వానికి / ఆవేశం ఊపిరి
ఆలోచన ఉనికి / ప్రయోజనం పరమార్థం

## అబ్దుల్ కలాం

నడిచే విజ్ఞానం / విలువల ప్రతిరూపం
యువతకు స్ఫూర్తి / భవితకు మార్గదర్శి

## తెలుగు సినిమా

విలువలు మృగ్యం / వలువలు పూజ్యం
కథలు కరువు / బడ్జెట్ బరువు

## రాజకీయం

పైసాయే పరమాత్మ
పలుకుబడి పరమ వాల్యూబుల్
నా దేశ రాజకీయం
కుక్కలు చింపుతున్న విస్తరి వైనం

## ఇన్‌సెక్యూరిటీ

సినిమాకెళ్లాలన్నా / షికారు చేయాలన్నా
చాట్ తినాలన్నా / చిట్‌చాట్ చేయాలన్నా
క్షణం క్షణం భయం భయం

## టీవీ సీరియల్స్

అంతా కృతకం / అరువు గొంతులు
అరవ సెంటిమెంట్లు
సగటు తెలుగు గృహిణికి సీరియల్ బ్రెయిన్‌వాష్

## నేను

ఆటుపోట్లు తట్టుకుంటూ
అంచెలంచెలుగా కంచెలు దాటుకుంటూ నేను
తమ నీడనే శంకించుకుంటూ
నిబిడాంధకారాలలో నిట్టూర్చుకుంటూ వాళ్లు
(మహాకవి శ్రీశ్రీ స్ఫూర్తితో)

## చేగువేరా

సాహసం ఊపిరిగా / స్వేచ్ఛే సందేశంగా
జీవించి మరణించిన
మరణించి జీవిస్తున్న చిరంజీవి

-బి.వి. శివప్రసాద్

దండగ కదా. విసుగచ్చిందేమో మీకు. మమ్మీకి షిరిడి సాయిబాబ అంటే చాలా ఇష్టం కదా. మన ఇంటికి దగ్గర్లోనే గుడి ఉంటే నేను ఎన్నడు పోవడానికి ఇష్టపడలేదు. నా సమస్యకు పరిష్కార నిమిత్తమేమో 'భక్తుల ప్రశ్నలకు బాబా జవాబులు' అనే పుస్తకంలోంచి నన్ను ఓ గురువారం నాడు ఒక నంబరు కోరుకొమ్మ న్నారు. ఆ నంబరుకు జవాబుగా 'ఆరు మాసాలలో నీ కార్యం విజయమునందును, బాబా నామస్మరణ చేయుము' అని వచ్చింది. అలానే చేద్దామనుకొని నిర్ణయించుకొని చదువులపై మనసును లగ్నం చెయ్యాలనుకొన్నాను. కాని నన్ను మీరు పూర్తిగా అర్థం చేసుకోలేదు. నా మనసులోని బాధ ఇంక పూర్తిగా మీకు తెలియదు. మీకు నేను చదవడం, బడికి పోవడం ఒక్కటే కావాలి. నేను బడిలో ఏం చదువుతున్నానో, అసలు మనసు లగ్నం చేస్తున్నానో లేదో మీకు తెలియదు. ఆ టీచర్లు ఏమి చెపుతున్నారో మీకు తెలుసా, వాళ్లకు ఏమి చదువు చెప్పడం మాత్రమే తెలుసు. పిల్లలమైన మేము ఎంత మానసిక క్షోభకు గురి అవుతున్నామో తెలుసా? అంత క్షోభపడుతూ, సున్నితమైన పిల్లల మనసులను విద్యనేర్పే పేరుతో గాయం చేస్తున్న ఈ విద్యా వ్యాపారం గురించి మీరెప్పుడైనా ఒక్కసారి ఆలోచించారా? దయతో నన్ను అర్థం చేసుకోండి. నన్ను చదువుకొమ్మన్నారు కదా, మంచి మార్కులు రాయాలని చదువుకొమ్మన్నారు కదా. చదువు లక్ష్యం మార్కులే అయితే ఇంటివద్దనే చదువుకొని మంచి మార్కులు తెచ్చుకొని మీకు, నాకు చదువు రాదు అన్నవాళ్లకు చూపెడతాను. చక్కగా చదువుకొని ఒక ఉపాధ్యాయున్నవుతాను. ఒక బడిని స్థాపిస్తాను. ఆ బడిలో ఎలాంటి దండనలు, బెదిరింపులు ఉండవు పిల్లలకు. ఒక ఆదర్శవంతమైన, ఆనందాలకు నిలయమైన లోకముంటుంది. ఆ బడిలో మీరు చెప్పేటటువంటి యాంత్రిక కృత్రిమ లోకం ఉండదు. దయతో నన్ను అర్థం చేసుకోండి. బడిపై, బడి పిల్లలపై డాడీ రాసిన పాటను జ్ఞాపకం చేసు కుంటున్నాను.

బడి చదువుల గుడిలాంటిది
చిన్నపిల్లల ఆటస్థలం లాంటిది
వలస వచ్చిన విడిది ఇల్లులాంటిది
చిన్నారుల బతుకు నిచ్చెనలాంటిది...

మమ్మీ, డాడీ– నన్ను అర్థం చేసుకొంటారు కదూ! ■